# జీడీకే 11వ ఇంక్లైన్‌లో కార్మిక సమస్యల పరిష్కారం




**ఎఐటియుసి నేతల వెల్లడి**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే 11వ ఇంక్లైన్‌లో కార్మికుల అనేక సమస్యలను పరిష్కరించామని, మిగిలిన సమస్యల పరిష్కారం దిశగా చర్యలు కొనసాగుతున్నాయని ఎఐటియుసి ఆర్జీ-1 బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, జీఎం కమిటీ సభ్యుడు సిద్దమల్ల రాజు తెలిపారు.

బుధవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించిన ఎఐటియుసి జీడీకే 11వ ఇంక్లైన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. 2023 డిసెంబర్ 27న జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎఐటియుసి విజయం సాధించిన అనంతరం, ఏరియా మరియు కార్పొరేట్ స్థాయిలో పలు సమావేశాలు నిర్వహించి కార్మికుల పెండింగ్ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామని పేర్కొన్నారు.ముఖ్యంగా ఓసీపీ-5 మార్గం కారణంగా కార్మికులు విధులకు హాజరుకావడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, చెక్‌పోస్ట్ నుంచి 11వ ఇంక్లైన్ వరకు పాత రహదారిపై ప్రయాణానికి అనుమతి పొందామని తెలిపారు. రోడ్డు మరమ్మతులు, సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

అదేవిధంగా కార్మికులకు ప్రమోషన్లు ఆలస్యం కాకుండా అందించడంతో పాటు, సపోర్టుమెన్ మొఖద్దం, టింబర్ మెన్ మొఖద్దం, ట్రామర్ మొఖద్దం, టెండాల్ సూపర్‌వైజర్, ఎల్‌హెచ్‌డీ ఆపరేటర్ పోస్టులకు పదోన్నతులు కల్పించినట్లు వెల్లడించారు.గనిలో భద్రతా చర్యల భాగంగా 24 గంటల అంబులెన్స్ సౌకర్యం, లైటింగ్, బీటీ రోడ్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్యాంటీన్ మరమ్మతులు, సిబ్బంది నియామకం, తాగునీటి సౌకర్యాల మెరుగుదల చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.నాలుగో సీమ్ వన్ డిప్‌కు చైర్‌లిఫ్ట్ ఏర్పాటుకు చర్యలు వేగవంతమయ్యాయని, త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. కార్మికుల సౌకర్యార్థం డిన్నర్ షెడ్‌కు రక్షణ జాలీలు, వాటర్ ట్యాప్‌లు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

మహిళా ఉద్యోగుల కోసం విశ్రాంతి గదులు, వాష్‌రూమ్‌లు, అండర్‌గ్రౌండ్‌లో టాయిలెట్ సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కార్మికుల భద్రత కోసం లాకర్లు, బైక్ పార్కింగ్ షెడ్, ల్యాంప్‌రూమ్ వద్ద ర్యాక్‌ల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని వివరించారు.కార్మికుల సమస్యల పరిష్కారంలో ఎఐటియుసి నిరంతరం కృషి చేస్తుందని నేతలు తెలిపారు. ఈ సమావేశంలో పిట్ సెక్రటరీ నాయిని శంకర్, సహాయ కార్యదర్శి గొడిశెల నరేశ్, నాయకులు మందల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓసీఎం-1 సిహెచ్‌పిలో సమ్మర్ మజ్జిగ పంపిణీ



**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని సింగరేణి ఓసీఎం-1 సిహెచ్‌పిలో వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఉద్యోగులకు మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిహెచ్‌పిలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, డ్రైవర్లకు మజ్జిగ అందజేసి ఉష్ణోగ్రతల ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నం చేశారు.ఈ కార్యక్రమంలో సిహెచ్‌పి డివైజీఎంలు కాశి విశ్వేశ్వర, గవ్వల శ్రీనివాస్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ గంధం శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ ఇంచార్జి అసిస్టెంట్ పిట్ సెక్రటరీ పోతు వెంకటేశం, సేఫ్టీ కమిటీ సభ్యులు రంగా వేణు, షిఫ్ట్ ఇంచార్జి పొన్నాల సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిద్ధ లింగయ్య, టెంపుల్ కమిటీ సభ్యులు నీర్ల రవీందర్‌తో పాటు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మీసేవ ఛార్జీల పెంపు



**సర్వర్ అప్‌డేట్లతో సేవలకు విరామం**
**ప్రజలు ముందస్తుగా పనులు పూర్తి చేసుకోవాలి**
**: ఎఫ్సీఐ క్రాస్ రోడ్ మేనేజర్ పల్లె బాపు**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల్లో సేవల ఛార్జీలు పెంపు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్సీఐ క్రాస్ రోడ్ మేనేజర్ పల్లె బాపు సూచించారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం, ఏప్రిల్ 1 నుంచి మీసేవ సేవలకు కొత్త రుసుములు అమల్లోకి వచ్చాయని చెప్పారు. ఇకపై ఆదాయ, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు సహా పలు సర్టిఫికెట్లకు రూ.80 వరకు వినియోగదారుల ఛార్జీలు వసూలు చేయనున్నట్లు వివరించారు. కొన్ని ఏ-కేటగిరీ సేవలకు రూ.62 ఫీజు కొనసాగుతుందని పేర్కొన్నారు. అలాగే బిల్లుల చెల్లింపులు, బయోమెట్రిక్ ఆథెంటికేషన్ వంటి సేవలకు వేర్వేరు రేట్లు అమల్లో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా, మీసేవ సర్వర్ అప్‌డేట్ పనుల కారణంగా ఏప్రిల్ 3 రాత్రి 8 గంటల నుంచి ఏప్రిల్ 5 ఉదయం 8 గంటల వరకు సేవలు నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమయంలో ఎలాంటి అప్లికేషన్లు ప్రాసెస్ చేయబడవని స్పష్టం చేశారు.ప్రజలు అత్యవసర సేవలను ముందుగానే పూర్తి చేసుకోవాలని, నిర్దేశిత రుసుముల కంటే ఎక్కువ వసూలు చేస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని పల్లె బాపు సూచించారు.

# యూజీడీ పనులపై పూర్తి స్థాయి విచారణ కోరిన కార్పొరేటర్ సూర్య

**కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

రామగుండం కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ( యు జి డి) నిర్మాణాల్లో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని సిపిఐ ఫ్లోర్ లీడర్, 41వ డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. ఈ మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్మెంట్ డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో ఆయన ఫిర్యాదు చేశారు.ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ఫండ్స్ కింద రూ.13.70 కోట్లతో యూజీడీ పనులకు సంబంధించి ఏడు ప్యాకేజీలుగా టెండర్లు పిలిచిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ టెండర్లలో కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి 0.5 నుండి 1.5 శాతం తక్కువ కోటేషన్లతో పనులు దక్కించుకున్నారని ఆరోపించారు. దీనిలో అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య కుమ్మక్కు జరిగి భారీ అవినీతి చోటుచేసుకున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు.వర్క్ ఆర్డర్ ప్రకారం ఆర్సీసీ పైపులతో నాణ్యతగా యూజీడీ నిర్మాణాలు చేయాల్సి ఉన్నప్పటికీ, కాంట్రాక్టర్లు నాసిరకం పనులు చేసి మట్టి పైపులు వినియోగించారని సూర్య ఆరోపించారు. చాంబర్ల నిర్మాణంలోనూ నాణ్యత ప్రమాణాలు పాటించలేదన్నారు.సి. డీ.ఎం.ఏ నిబంధనల ప్రకారం ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ఫండ్స్‌ను




కార్మికుల జీతాలు, అత్యవసర అవసరాలకు వినియోగించాల్సి ఉన్నప్పటికీ, వాటిని యూజీడీ పనులకు మళ్లించడం వల్ల ప్రభుత్వానికి, కార్పొరేషన్‌కు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో యూజీడీ పనులపై విజిలెన్స్ విచారణ చేపట్టి, అవినీతికి పాల్పడిన అధికారులపై, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ పూర్తయ్యే వరకు బిల్లులు చెల్లించకుండా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.అధికారులు నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన సూర్య, అవసరమైతే సీడీఎంఏ, ఏసీబీ, గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సమస్య పరిష్కారం కాని పక్షంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతతకు తోడ్పడుతుంది..



**హనుమాన్ నామస్మరణతో మారుమోగిన పోలేపల్లి**
**హనుమాన్ ఇరుముడి పూజలో పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా,**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఆధ్యాత్మిక చింతన భక్తి భావంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఉమ్మడి మహబూబ్నగర్ డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలంలోని పోలేపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ దోనోదుల కుమార్ ఆధ్వర్యంలో హనుమాన్ ఇరుముడి పూజా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, సింగల్ విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, ఆమనగల్లు మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఎనుమల రమేష్, ఎంగలి భాగ్యలక్ష్మి రఘు, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి, రామ్ నుంతల సర్పంచ్ శ్రీను నాయక్, రామ్ చందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గణపతి హోమం, ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకటేష్ గుప్త మాట్లాడుతూ హనుమాన్ మాలధారులు మండల దీక్ష 41 రోజు కఠిన నిష్ట తరువాత స్వామికి సమర్పించే పవిత్రమైన సమర్పణ ఇరుముడి జరుగుతుందని అన్నారు. పోలేపల్లి గ్రామం అంత హనుమాన్ నామస్మరణతో మారుమోగింది ముఖ్యంగా ఆంజనేయ స్వామి భక్తులు మాలధారులు పెద్ద ఎత్తున హాజరై ఇరుముడి కట్టుకున్నారు. ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రనాయక్, ఉప సర్పంచ్ శ్రీను, నాయకులు మాజీ సర్పంచులు జోగు వీరయ్య, లాలయ్య, సుక్కమ్మ, లాయక్ అలీ, రాయకంటి సురేష్, శ్రీను, హేమ్లా బావోజి, గన్యా నాయక్, బద్రి నాయక్, మహేష్ గౌడ్, శాంతి లాల్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో లేబర్ కోడ్స్ అమలు చేయొద్దు



**నల్ల బ్యాడ్జీలతో కార్మికుల నిరసన**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**


కార్మిక వర్గానికి నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్‌ను సింగరేణి సంస్థలో అమలు చేయవద్దని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం ( ఐ ఎఫ్ టి యు) డిమాండ్ చేసింది. దేశవ్యాప్త "బ్లాక్ డే" సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి బొగ్గు గనుల విభాగాల్లో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆర్జీ-1 డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో 1, 2, 2ఏ, 11ఏ గనుల మేనేజర్లకు వినతి పత్రాలు సమర్పించారు.సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ నరేష్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందని విమర్శించారు. ఇవి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉండి, కార్మికుల హక్కులను హరించేలా ఉన్నాయని అన్నారు.లేబర్ కోడ్స్ అమలుతో పారిశ్రామిక వివాదాలు పెరిగే అవకాశముందని, కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నిబంధనలు ఇందులో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కోడ్స్ అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు.కార్మికులు, సంఘాలు, అధికారులు, యాజమాన్యం కలిసి సంస్థ అభివృద్ధికి కృషి చేయాల్సిన సమయంలో ఈ విధమైన నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకు కార్మిక వర్గం పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం రామగుండం రీజియన్ ప్రధాన కార్యదర్శి ఈదునూరి రామకృష్ణతో పాటు ఐ రాజేశం, ఎస్ ప్రసాద్, చింతల శేఖర్, పేరుక మొండయ్య, ఎడ్ల రవికుమార్, పోగుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు 33వ డివిజన్‌లో 'ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక'

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**

ప్రజల సమస్యలను వారి ముంగిటకే చేరుకుని పరిష్కరించాలనే లక్ష్యంతో చేపట్టిన 'ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ)'లో భాగంగా నేడు (గురువారం) 33వ డివిజన్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు.స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని డివిజన్ కార్పొరేటర్ మెరుగు భూలక్ష్మి--లింగమూర్తి తెలిపారు.డివిజన్ పరిధిలోని డ్రైనేజీ, మంచినీటి సరఫరా, వీధి దీపాలు తదితర పౌర సమస్యలపై ప్రజలు నేరుగా ఫిర్యాదులు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. స్వీకరించిన వినతులను సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.అలాగే డివిజన్ అభివృద్ధికి సంబంధించి ప్రజల సూచనలు, సలహాలను కూడా స్వీకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను తెలియజేయాలని కోరారు.

## ఘనంగా స్పందన స్కూల్ గ్రాడ్యుయేషన్ డే



**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

రామగుండం 8ఇన్‌క్లైన్ కాలనీ సీర్ క్లబ్‌లో స్పందన స్కూల్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

విద్యార్థులు చదువుతో పాటు మంచి విలువలను అలవర్చుకోవాలని సూచించిన ఆమె, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్రను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వేడుకలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పడకల్ గ్రామంలో నిర్వహించే గ్రామ సభను విజయవంతం చేయాలి

**సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిద్దాం**
**సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



తలకొండపల్లి మండలంలోని పలకల గ్రామంలో నేడు ఉదయం 10 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించే గ్రామ సభలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు, యువజన సంఘం సభ్యులు, మహిళా సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామంలో ఉన్న వివిధ సమస్యలను గ్రామ సభ ద్వారా సర్పంచ్ మరియు కార్యదర్శికి తెలియజేయాలని సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

